

# లోకాంతరాలు

శ్రీ పి. సత్యనారాయణశాస్త్రి

అందరి దృష్టులూ 'శార్వరి' వైపు తిరిగాయి ఆమె ఏ సమాధానం ఇస్తుందో అని. ఆమె ఏమీ మాటాడలేదు. తలవంచేసి కూర్చుండి. కొంత సేపంతా నిశ్శబ్దం. శాస్త్రిగారు మళ్లీ ప్రశ్నించారు. "నీకేమిటి అభ్యంతరం చెప్పమ"ని.

నా కళ్ళప్రయత్నంగా క్లాసందరి వేపూ చూశాయి. ప్రతివానిలోనూ ఎంతో ఉత్సాహం కనిపించింది. విద్యార్థినుల కళ్లుకూడా ఆనందంతో మెరిశాయి. ప్రతీ వారిహృదయం ఆనందరంతో నిండిపోయింది. "ఊఁ!" అని శార్వరి తన అంగీకారం తెల్పడం ఒక్కటే తరవాయి. అందుకే నిశ్శబ్దంగా అందరూ ఆమెవైపే చూస్తున్నారు. 'అల్లాగే' అని శార్వరి ఒప్పుకోవడానికి బదులు ఇంత ఆలస్యం చేస్తుందేమా అనిపించింది నాకు. అవును మరి! 'శార్వరి' ఎన్నో స్టేజిలమీద అద్భుతంగా నాట్యంచేసి విపరీతమైన గౌరవాదరాల్ని సంపాదించింది. ఆమె హస్త విన్యాసాలు, భ్రూకుటి నిక్షేపములూ, శివతాండవదృశ్యములో నామె చూపే లాస్యభంగిమ మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే మధురాతి మధుర ప్రదర్శనాలు కాలేజీలో ఆమె బి. యే. లో చేరినప్పటికే ప్రతీస్టూడెంటూ ఆశించాడామె భరత నాట్యప్రదర్శనం చూడగలనని. ప్రతి కాలేజీ ఫంక్షన్ కీ యీ విధంగానే తప్పుకుంటూంది. అందుకే ప్రతివాని హృదయంలోనూ ఎంతో ఆతురత, ఆకాంక్షా ఎక్కువైపోయాయి. ఆమె కళావిన్యాసాన్ని ఎప్పుడు చూద్దామా అని కాలేజీ లెక్చరర్ల దగ్గిరనుంచి, విద్యార్థి విద్యార్థినీ బృందమంతా కనిపెట్టుకునే ఉన్నారు.

ఆమెకుగల, కళాప్రతిభ అంతా ఒక యెత్తూ- సాటి విద్యార్థిలోకంలో ఆమెకు గల గౌరవం ఒక యెత్తూ-ప్రతి స్టూడెంటూ ఆమె అంటే ఎంతో గౌరవం చూపిస్తాడు. మరి ఆ మహిమ ఆమె ముఖంలో ఉందో-ఏమో తెలియదు. ఎంత రౌడీ అయినా సరే 'శార్వరి' అంటే ఎంతో గౌరవం చూపిస్తాడు. కాలేజీఅంతా ఆమె కభిమాన పాత్రమే-ఆమె కళా వైదుష్యాన్ని కళ్లారా చూడాలనే కాంక్షతో ఉన్నవారే అందరూను. అందుకే ఆమె సమాధానంకోసం మొత్తం క్లాసంత నిశ్శబ్దంగా వేచియున్నారు. వచ్చే 'కాలేజీ డే' నాడైనా 'శార్వరి' భరతనాట్యం చేస్తుందేమోనని కాలేజీ 'డ్రమెటిక్ ఎసోషియేషన్ ప్రెసిడెంటు' అయిన కాలేజీ తెలుగు ప్రధానాచార్యులు 'శాస్త్రి' గారడిగారు.

"నీపేరు వెయ్యమంటావా?" అన్నారు మళ్లా శాస్త్రిగారు రెట్టించే ఉత్సాహకంఠంతో.

శార్వరి నెమ్మదిగా కళ్లెత్తి ఆచార్యుల వైపు చూసి మళ్ళీ దించేసుకుంది. క్లాసంతా ఆమె అంగీకరించిందనుకున్నారు. కాని తలవంచుకునే సమాధానమిచ్చింది 'వద్దు' ని. అంతా తెల్లబోయాము.

శాస్త్రిగారు పూర్తిగా నిరుత్సాహపడిపోయారు. కొంతసేపు నిశ్శబ్దం.

"కాలేజీలో శక్తిఉన్న వాళ్లుండగా, బోలెడంత డబ్బు ఖర్చుపెట్టి, పైవాళ్లని రప్పించి వినోద ప్రదర్శనా లివ్వడం అంత బాగుండదు." అని శాస్త్రి తూచి తూచి మాట్లాడారు ప్రతీ అక్షరమూను.

"ఇంతకీ నీకేమిటి అభ్యంతరం - చెప్పు ?... స్టూడెంట్సు గెలిచేస్తారనా ?" అన్నారు లెక్చరరుగారు.

"వారిమీద నాకు విశ్వాసముంది" అంది వెంటనే శార్వరి. ఈ సమాధానానికంతా సంతోషించాము. శార్వరి హృదయ వైశాల్యం మరొక్కమారు ప్రదర్శితమైంది. ఆమె ఎంతగా విద్యార్థుల మనస్సులు దోచుకొంటోందో, అంతగా ఆమె నాట్యము చూడాలనే తీవ్రవాంఛ మాలో ప్రబలమైపోతోంది. మరి ఆమెకు గల అభ్యంతర మేమిటో ఎవళ్లకీ అర్థము కాలేదు. ఆ కారణ మేమిటో తెలుసుకోవాలనే పట్టుదలతో ఉన్నట్టున్నారు. శాస్త్రిగారు, పాఠంమానేసి కారణం చెప్పాలని పట్టుపట్టడంతో శార్వరి కింక కారణం చెప్పక తప్పిందికాదు. తలవంచుకునే చెప్పింది "నా నాట్యప్రదర్శనానికి, ప్రతిఫలం యీయవలసి ఉంటుంద"ని.

శార్వరివద్దనుండి ఇంత నీచ సమాధానం వస్తుందని ఎవ్వరమూ ఊహించలేదు. క్లాసంతా గుసగుసలతో నిండిపోయింది. శాస్త్రిగారొక వేడి నిట్టూర్పు విడిచి ఊరుకున్నారు. ఇంతలో బెల్ కొట్టడం క్లాసు డిస్పర్స్ అయిపోవడం జరిగింది-

ఆనాటి సాయంత్రం.

శార్వరి కాలేజీ అవగానే ఇంటికి వెళ్లిపోతోంది. ఆమె వెనకాలే ముగ్గురు స్టూడెంట్సు బయలుదేరారు.

"జాతిగుణా లెక్కడికి పోతాయి" అన్నాడొకడామెకి వినపడేలా.

"ధనమూల మిదం జగత్" మరొకని వ్యాఖ్య.

"అంతే-డబ్బుకి...!" అన్నాడర్థోక్తితో వ్యంగ్యంగా మరొకడు.

అతని మాటలకి ముగ్గురూ పకపకా నవ్వారు. ఆమాటలు విని నాకూ నవ్వు వచ్చింది. ముందు వెళ్లే శార్వరివైపు చూశా. ఆమె కాళ్లు తొట్రుపడుతున్నాయి. కంగారుగా నడుస్తోంది.

"ఇంతోటి కళాప్రదర్శనానికి..." మళ్లీ మొదలెట్టారు వెనకాల వెళ్లే స్టూడెంట్సు.

"నాట్యరాణీ ఓయ్ !" అని గట్టిగా అరిచాడు మరొకడు.

అంతే అప్పటినుండీ ఆమెపేరు నాట్యరాణి అని ప్రాకిపోయింది. ఆమెనాట్యప్రదర్శనాన్ని చూడలేకపోయామే అనే బాధ యీవిధంగా అసూయలోకి మారి ఆమె మనస్సు బాధపెట్టడంద్వారా తగ్గించుకున్నారు స్టూడెంట్సు. లేడీ స్టూడెంట్సులో కూడా 'శార్వరి' మీద అసహ్యభావం ప్రబలిపోయిందని ఆచోకీ వచ్చింది ప్రఖ్యాత కాడీ,వీరాజుద్వారా. శార్వరి ఎక్కడ కనిపిస్తే అక్కడ విమర్శనలూ, పిల్లికూతలూ ఎక్కువై పోయాయి.

సరే-కాలేజీ డే, నిన్నకదూ " నిన్నం జరిగిందంటే - ప్రైజులూ, అవీ పంచిపెట్టిన తర్వాత అధ్యక్షులైన ప్రిన్సిపాల్ అంత్యోపన్యాసములో "కాలేజీలో శక్తి ఉన్న వ్యక్తులు న్నారు. కాని వారికి డబ్బు కావాలిట!...అందుచేత భరతనాట్యం ప్రోగ్రాములోంచి తగ్గించవలసివచ్చింది." అన్నారు. స్టూడెంట్సంతా విపరీతమైన హర్షధ్వానాలు చేసి 'నాట్యరాణి' అని అరిచారు. లేడీసీట్లవేపు చూశా నేను. శార్వరి తలవంచేసింది. ప్రక్కనున్న ఆమె లేడీక్లాస్మేట్సు, జేబురుమాలుల చాటున నవ్వుకున్నారు క్రీగంట నామెవైపు చూస్తూ-

కొంతసేపటికి అల్లరి తగ్గింది. నాటక ప్రదర్శనం మొదలెట్టారు. శార్వరిమాత్రం తలవంచుకునే కూర్చుంది. అంతా నాటకంలో మునిగిఉన్నారు. కొంతసేపలాగే కూర్చుని తర్వాత లేచివెళ్లిపోయింది ఆమె. నాటకంహడావిడిలో ఆమె వెళ్లిపోవడాన్ని గుర్తించలేదెవళ్లూ - నేను మాత్రం ఆమె వెళుతూ వెళుతూ జేబురుమాలతో కళ్లనీళ్లు తుడుచుకోవడం చూశా-

ఇదీ శార్వరిసంగతి-ఇంక చెప్పు ఆమె గురించి ఎందుకంత గుచ్చిగుచ్చి అడిగావో అన్నా శర్మ ముఖంలోకి చూస్తూ-

"అయితే విను చెబుతా" అని శర్మ సాగించాడు తన కథనాన్ని సిగరెట్టు ముట్టిస్తూ.

"నిన్ననే అన్నావు కదూ కాలేజీ డే-అవును. నిన్నే- ఆమె ఇంటికి వస్తూండగానే రోజూలాగ నవ్వుతూ ప్రశ్నించా "కాలేజీ విశేషాలేమిటి ?" అని. ఏమీ లేవన్నట్టు తల అడ్డంగా ఊపి, జేబురుమాలులో ముఖం అవతలివేపుగా దాచుకొని లోపలికి వెళ్ళిపోయింది. రోజూ నవ్వుతూ కబుర్లు చెప్పేది, ఇవాళ ఇల్లా ఉందేమిటూ? అనిపించి అరుగుమీదే పచార్లు చేస్తూ తిరుగుతున్నా. ఒక అరగంటలోనే భోజనం పూర్తిచేసేసుకొని వచ్చి, వీధి అరుగుమీద ఉన్న తన స్టడీ రూమ్‌లో కూర్చుంది. క్రీనీడలో నేనున్నాను. నేనామెకి కన్పించటంలేదు. కాని,ఆమె ముఖభంగిమలన్నీ నాకు సుస్పష్టంగా గదిలో టేబిల్ మీద ఉన్న లైటుకాంతివల్ల కనిపిస్తూనేఉన్నాయి. కుర్చీలో కూర్చుని, ఇంటి పైకప్పుకేసి చూస్తూ కొంతసేపుండిపోయింది శార్వరి. ఏదో ఆలోచిస్తున్న ఆమె నిశ్చలతవైపే చూస్తూ అరుగుమీద నిలబడి ఉన్నా. కొంతసేపటికి ఆమె చెంపలమీద నుంచి కన్నీరు కారుతోంది.

ఆమెలో ఏమీ చలనంలేదు. టేబిల్ మీద బిగ్ బెన్ మాత్రం టిక్ టిక్ మంటూ శబ్దం చేస్తోంది. క్షణక్షణానికీ ఆ కన్నీళ్లు ఎక్కువై పోతున్నాయి. ఇంక నాకు అరుగుమీద ఉండబుద్ధి వేయలేదు. వెంటనే ఆమెగదిలోకి వెళ్లి "శార్వరీ!" అన్నా. ఆమెలో ఏమీ చలనంలేదు. "ఎందుకలా ఏడుస్తావ్ ?" అన్నా బుజ్జగించే కంఠంతో. నావేపు తిరిగి వెంటనే టేబిల్ మీద ముఖం పెట్టుకొని వెక్కి వెక్కి ఏడవసాగింది. ఎంతసేపు అడిగినా ఏమీ సమాధానం చెప్పలేదు.

ఆఖరకి కళ్లనీళ్లు తుడుచుకొని అంది "అవమానంకన్నా చావు మంచిది" అని.

నాకేమీ అర్థంకాలేదు. ఏం జరిగిందో చెప్పమని మరీ మరీ అడిగాను. కొంతసేపు శూన్యంలోకి వెర్రిగా చూస్తూ ఉండిపోయింది. అప్పుడు మొదలెట్టింది.

"మాఅమ్మ పోయేటప్పటికి నాకు రెండేళ్లుంటాయి. అసలు మాఅమ్మ రూపమే నాకు గుర్తులేదు. అప్పటినుండీ, నన్నూ అయిదేళ్ల వయసులో ఉన్న అక్కయ్యనూ కంటి రెప్పల్లా పెంచుకుంటూవచ్చాడు మా నాన్న. ప్రతిరోజూ ఆఫీసునుంచి రాగానే నన్ను ఎత్తుకొని "చిట్టీ బువ్వ తిన్నావామ్మా?" అని అడిగి, అక్కయ్యను ముద్దెట్టుకొని మళ్లీ తను భోజనం చేసేటప్పుడు 'గోరుముద్ద' అంటూ అన్నం పెట్టి పెంచాడు మా నాన్న.

మా నాన్న చిన్నప్పటి స్నేహితులట,


## నెరసిన వెంట్రుకల ఔషధము

రంగు పూయనక్కరలేదు. ఆయుర్వేద చికిత్స తెల్లనిరంగును మార్చి శాశ్వతముగా వెంట్రుకలకు నలుపు నిచ్చును. గుణం కానిచో, డబ్బు వాపసు చేయబడును. తెలుపు కొంచెమై యుండిన రు. 2-8-0. 3 ఒకేసారి రు. 6-8-0. మధ్యరకమై యుండిన,రు. 3-8-0, 3 సీసాలు ఒకేసారి రు. 9. పూర్తిగాయుండిన రు. 5/- 3 ఒకేసారి రు. 12/-

**VIJOY LABORATORIES No. 14**

**P. O. Manoharpur (Singhbhum)**

నాకూ అక్కయ్యకూ నాట్యం నేర్పిన మూర్తిగారు. నాకు ఎనిమిదో ఏట అనుకుంటా మాయింటికి వచ్చి, అక్కయ్యనూ నన్నూ చూసి ఎంతో సరదాపడి "భరత నాట్యం నేర్పుతానోయ్ మీ అమ్మాయిలకి" అన్నాడు. నాకు ఎంతో సరదా వేసింది ఆయన నాట్యం చూసినప్పుడు. అందుకు నేనూ నేర్చుకుంటానని ఒప్పుకున్నా అక్కయ్యతోపాటు. కాని నాన్న ఓపట్టాన్న ఒప్పుకోలేదు. ఏదో నాన్నా' ఆయనా గట్టిగా వాదించుకున్నారు. చివర మా నాన్న అన్న ముక్కలే నాకు జ్ఞాపక మున్నాయి "నా చిట్టితల్లుల సంపాదనమీదా నాముసలితనం గడవడం ?" అని.

మూర్తిగా రేమైతేనేం పట్టుదలతో ఆయన విద్యంతా మా ఇద్దరికీ నేర్పారు. మొట్టమొదట ఆయనే స్టేజి ఎక్కించి మాకు జరిగిన సన్మానాన్ని కళ్లారా చూసి ఆనందించారు. తర్వాత తర్వాత నాన్న రిటైర్ అవడమూ, మా నాట్యప్రదర్శనాల వల్ల వచ్చిన సొమ్ముతోనే మా సంసారం జరిగిపోతూండటం నువ్వు ఎరిగినదే! రానురాను నాన్నకి డబ్బుమీద లోభత్వం రావడం, నూట పదహార్లకి తక్కువ రాకపోతే మమ్మల్ని స్టేజి ఎక్కనీయక పోవడం జరిగింది. డబ్బులో ఇంత కర్కశత్వం నాకు మనస్సులో ఎంత ఇష్టం లేకపోయినప్పటికీ మా ఆర్థిక పరిస్థితులూ, మా నాన్నపై నాకు గల భయభక్తులూ ఆయన్ని కాదనటానికి వీలులేకుండా చేశాయి. నేను కాలేజీలో చేరిన క్రొత్త 'కాలేజీ ఫంక్షన్‌కి నాట్యం చేస్తానని' చెబితే సొమ్ము విషయంలో తాను తృప్తిపడి అంగీకరిస్తేనే కాని నాట్యం చేయడానికి వీలులేదన్నాడు. కాలేజీలో నాట్యానికి డబ్బు తీసుకుంటానని కాలేజీ లెక్చరర్లతో ఎట్లా చెప్పగలను చెప్పు శర్మా ?...అని ఆగిపోయింది హఠాత్తుగా.

"ఇంతకీ ఏడవడానికి కారణం ఏమిటి" అని అడిగా శార్వరిని.

"ఏంలేదు-" అని ఇంక నేనెంత ప్రయత్నించినా సమాధానం చెప్పకుండా సంభాషణ తప్పించేసింది. ఇంక ఆమెవల్ల లాభం లేదని. నిన్ను అడిగాను యీ విషయం" అన్నాడు శర్మ.

నేను పరధ్యానంగా ఉండటాన్ని పసిగట్టి కాబోలు ప్రశ్నించాడు "ఏమిటాలోచిస్తున్నా." వని శర్మ.

"స్టూడెంట్సు మన సత్వం ఇంతటిది" అన్నా బరువుగా శ్వాస వదులుతూ-

కొంతసేపు శర్మ మాట్లాడలేదు. అప్పుడన్నాడు. "స్టూడెంట్సు మన సత్వమే కాదు, కారణం తెలియకుండా వ్యాఖ్యానాలు చెయ్యడం అందరికీ మామూలే! లోకంతీరే అంత" అని—

# దాగిన ద్వేషం

(4-వ పేజీ తరువాయి)

స్టేట్‌మెంట్ ఇచ్చేసి వెళ్లిపోతాను. నాకింక మీ కేసుతో సంబంధం ఉండదు."

"అందుకొక్కాదు. ఇప్పుడే మామయ్యని తీసుకొస్తాను."

"అయితే అంకరాజిప్పుడెక్కడున్నాడు? ఆయన్ని కూడా పిలవండి."

సరేనని రామచంద్రరావు వెళ్ళాడు. కొంతసేపట్లో దుర్గయ్యగారొక్కడూ వచ్చాడు. గజగజ వొణికిపోతున్నాడు. మాధవరావుని చూడగానే గుండెలు పట్టుకున్నాడు, నిలబడే ఉన్నాడు.

మాధవరావు కటువుగా అన్నాడు. "చాల్లెండి. ఇంక ఆపండి మీవొణుకు. ఈ నటనంతా ఎవరికోసం? మీ మేలేదో మీరు గ్రహించలేరు?"

దుర్గయ్యవొణుకు ఆగిపోయింది. నోరు తెరుచుకుని చూస్తున్నాడు మాధవరావు వంక.

"ఏం జరిగిందో మీకు పొద్దున్న తెలియదా?"

"తెలియదండి"

"పోనీ మీతలగడకింద కత్తి ఉన్న సంగతి తెలుసా?"

"తెలియదు."

"మీభార్య గదిమారిన సంగతి తెలుసా"

"తెలియదు"

"నావద్ద మీరేమీ దాచవద్దు. మీ వల్ల నిజంగా దోషం లేనిపక్షంలో మిమ్మల్ని కాపాడగలను. నిజం చెప్పండి. రాత్రి జరిగిన సంగతి మీకు బొత్తిగా తెలియదు."

"తెలియదు. ప్రమాణపూర్తిగా చెప్తున్నాను."

"నిద్రలో మీరు చేసివుండవచ్చునని మీకు అనుమానం ఏమైనా వుందా ?"

"నాచేత అటువంటి పని జరగదని నా నమ్మకం లీడర్ గారూ. కాని జరగవచ్చునని డాక్టర్లంటున్నారట. నాలో ఆ సత్తా, ఆధైర్యం లేదు.

"మరి ఈ నటనంతా ఎందుకోసం. దీనివల్ల మీపైన నేరం స్థిరపడటం లేదా?"

"అట్లా కాదు. ఎప్పుడో ఏదో ప్రమాదం జరిగితీరుతుందని నాకు అనుమానం గట్టిగా ఉంది. అందువల్ల భయంతో ఈవిధంగా చేస్తున్నాను."

"కాని అది మానండి. అంతేకాదు, మీరే ఈ హత్య చేసినప్పటికీ నిర్భయంగా చెప్పండి. చెయ్యాలని చేసినదైనా చెప్పండి, మీ ప్రాణాన్ని కాపాడే బాధ్యత నాది."

"నేను నిజమే చెప్తున్నాను. నాకేమీ తెలియదు. నేను చెయ్యాలని చెయ్యలేదు. నిద్రలో తెలియకుండానైనా సరే నేను చేశానో లేదో నాకు తెలియదు."

"సరే. కాని పరిస్థితులన్నీ మీకు వ్యతిరేకంగా ఉన్నాయి. మీరు పారిపోకండి. నేరం మీపైనే మోపబడుతున్నది. కాని మీరు జంకవద్దు. మీరు ఇంటివద్దనే ఉండండి. మిమ్మల్ని ఎరెస్ట్ చేసినా భయపడవద్దు. ఆపైన నేను చూస్తాను. మీరు తెలిసిచెయ్యనిపక్షంలో నేను మిమ్మల్ని తప్పకుండా కాపాడగలనని ధైర్యంగా చెప్పగలను. అయితే ఒక ముఖ్యమైన పనివుంది. అంకరాజుతో వ్యవహారం తగువు లేకుండా పరిష్కారం చేసుకోవాలి. అతనికి కబురు పంపండి నేను మాట్లాడతాను."

గభాలున దుర్గయ్య మాధవరావు కాళ్లపైన పడ్డాడు. రక్షించవలసిందని ప్రార్థించాడు.

అందరూ మౌనంగా కూచున్నారు. రామచంద్రరావు వచ్చాడు. అంకరాజు ఇంట్లో లేడు. ఎక్కడికి వెళ్ళాడో తెలియదు.

దుర్గయ్య ఇంటికి చేరడంతోనే పోలీసులు ఒక వారంట్ అందచేశారు. ఆయన్ని ఆ యింటినుంచి కదలరాదని ఆజ్ఞాపించారు.

తమాషాప్రశ్నకు జవాబు:—
తుమ్మెదలు 4; పువ్వులు 8.


## రొక్కంగా అప్పులు తీసుకొనండి

వడ్డీ పద్ధతిమీద మీరు అప్పులు తీసుకొనవచ్చును. ఒక గవర్నమెంటు బాండు మెంబర్‌షిప్ ఫారము రు. 4/- లకు పంపబడును. దానిని పూర్తిచేసి పంపిన వెంటనే మీకు డబ్బు చేరును.

**RELIABLE CIRCULATION COMPANY,**
**Post Bag No 64, CALCUTTA 1.**